క్లుప్తంగా

దళితులపై ప్రభుత్వాలకు చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బాలయ్య

హుస్నాబాద్: దళితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, దళిత బంధు దళితుడికి అందిన దాఖలాలు లేవని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బాలయ్య అన్నారు. పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో గురువారం దళిత హక్కుల పోరాట సమితి మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత దండు కదిలిందని, ప్రభుత్వాల పీఠాలకు బీటలు వారేలా సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం డీహెచ్‌పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాకు దూరంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

మద్దూరు(హుస్నాబాద్): గుడుంబా తయారీదారులపై చర్యలు తప్పవని చేర్యాల సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం దూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండా గుడుంబా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గుడుంబా తయారు చేసినట్లయితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిషేధిత వస్తువును ఇళ్లలో దాచుకోవద్దని గుడుంబ, బెల్లం, మద్యం విక్రయించొద్దన్నారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడిగితే చెపొద్దన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ మహేందర్, ఎస్ఐ వినోద్‌కుమార్, మద్దూరు ఏఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శాలివాహనులకు ప్రాధాన్యమివ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న శాలివాహన కమిటీ సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన శాలివాహనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వక పోవడం బాధాకరమని శాలివాహన కమిటీ మండల అధ్యక్షుడు నక్షత్ర స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సభల్లో కుమ్మరులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలివాహనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. తమ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టక పోతే రాబోయే రోజుల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం శాలివాహన మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కుమ్మరి బాగులు, ప్రధాన కార్యదర్శిగా బాలమల్లు, కోశాధికారిగా బాలయ్య, ప్రచార కార్యదర్శిగా దుబ్బ రాజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కుమ్మర్ల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో కుమ్మరుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా స్వామి, ఉపాధ్యక్షుడిగా బాగులు, ప్రధాన కార్యదర్శిగా బాలమల్లు, బాలయ్య, దుబ్బరాజం, చంద్రం, సిద్దిరాములు ఎన్నికయ్యారు.

నీరా కేఫ్ బిడ్డింగ్ ఉపసంహరించుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం నీరా కేఫ్ బిడ్డింగ్ (టెండర్) ప్రక్రియను ఉపసంహరించుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ డిమాండ్ చేశారు. గురవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు గీత కార్మిక సంఘం పోరాటం ఫలితంగానే హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో రాష్ట్ర ప్రభుత్వం నీరా కేఫ్ ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు నీరా కేఫ్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడానికి జీఓ 116 విడుదల చేసిందన్నారు. నీరా కేఫ్ టెండర్‌ను రద్దు చేసి వెంటనే గీత కార్మికుల ఉపాధి మెరుగు పరచడం కోసం తాడి కార్పొరేషన్‌కు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో మేరింద్ల శ్రీనివాస్, అంబాల బుచ్చిరాములు, గుడాల గణేష్, పోతుగంటి ప్రసాద్, పచ్చిమడ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిరావయ్య.. పార్వతీ తనయ

భక్తులతో పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ తల్లి చెంతకు చేరాడు. గురువారం పలు వినాయక మండపాలలో నెలకొల్పిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనాలు చేశారు. సిద్దిపేటలో నిర్వహించిన శోభాయాత్రలో కేరళ, మహారాష్ట్రకు చెందిన యువతులు డప్పులు, కోలాటాలతో సందడి చేశారు. వాడవాడలా ఏకదంతుని నామస్మరణతో మార్మోగింది. వెళ్లిరావయ్య పార్వతీ తనయ అంటూ వీడ్కోలు పలికారు.



సిద్దిపేటలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



పెద్దకోడూరులో నిమజ్జన ఊరేగింపులో మహిళలు



జగదేవ్‌పూర్ (గజ్వేల్): తిగుల్ గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో చిన్నారుల సందడి



దుబ్బాక: ప్రత్యేక పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత



మద్దూరు(హుస్నాబాద్): రేబర్తిలో వినాయకుడిని దర్శించుకున్న జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి



కోహెడలో వినాయకుడిని దర్శించుకున్న సర్పంచ్ నవ్య తదితరులు



గుర్రాల గొందిలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపులో యువకులు

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



దౌల్తాబాద్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ శ్రీనివాస్,మహిళలు



హుస్నాబాద్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

దౌల్తాబాద్(దుబ్బాక): గ్రామంలో పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అప్పావారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గాజులపల్లి గ్రామ మహిళలతో కలిసి సర్పంచ్ శ్రీనివాస్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇళ్ల పరిసరాల్లోని పిచ్చి మొక్కల తొలగించారు.

భవిష్యత్ కోసం స్వచ్ఛత కార్యక్రమాలు: మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: స్వచ్ఛత కార్యక్రమాలుభవిష్యత్‌కు ఉపయోగపడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు తడి, పొడి చెత్తపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన హాసిని, అమూల్య, హర్షితలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, పాఠశాల ప్రత్యేక అధికారి మమత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు రవికుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సింహగర్జన ర్యాలీ

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం నిర్వహించతలపెట్టిన సింహగర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని టీవైఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ (డి) నుంచి బీసీ (ఏ)లోకి మార్చాలని, చట్టసభల్లో పదవులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ల హక్కులపై చర్చించారు. కాగా అక్టోబర్ 4న గజ్వేల్‌లో జరగబోయే ముదిరాజ్‌ల సింహగర్జన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు, ముదిరాజ్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వినూత్న నిరసన

దుబ్బాక: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చెవిలో పువ్వుతో వినూత్నంగా నిరసన తెలిపారు. రాష్ట్రంలో 32 ఏళ్లుగా 28 వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హుస్నాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు గురువారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. 32 ఏళ్లుగా విధులు పనిచేస్తున్నా పనికి తగ్గ పారితోషికం ఇస్తున్నారే తప్ప కనీసం వేతనం ఇవ్వడం లేదన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం, ఆరోగ్య భద్రత, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు ఆశా వర్కర్లు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాల స్వామి పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి నాలుగో రోజుకు చేరింది. అక్బర్‌పేట-భూంపల్లిలో ఆశా వర్కర్లు చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మద్దెల అంజయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

తొగుట(దుబ్బాక): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు చేపట్టిన దీక్షలు గురువారం ఐదో రోజుకు చేరాయి. వీరి దీక్షలకు సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో 28 వేల మంది ఆశా కార్యకర్తలు 32ఏళ్లుగా సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం మానవత్వంతో ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరారు.



దుబ్బాకలో చెవిలోపువ్వుతో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు



అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

సంక్షిప్త వార్తలు

◆ మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని పూజలు

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ మూడోసారి తెలంగాణ సీఎం కావాలని హరిప్రియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని గోనెపల్లిలో వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు కమలాకర్ చారి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతీ పేదవాడికి లబ్ధి చేకూరిందన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయన్నారు. మూడోసారి సీఎం అయితే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.

◆ బీఆర్‌ఎస్‌కే అధికారం

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే గ్రామల్లో తాగు, సాగునీటి సమస్య తీరిందన్నారు. రానున్న ఎన్నికలలో జనగామ నియోజికవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సార్ల కిష్టయ్య, గొల్లపల్లి కిష్టయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింహులు, ఉపసర్పంచ్ కొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ అత్యాధునిక సాంకేతికతతో ఫ్యాక్టరీ నిర్మాణం

నంగునూరు(సిద్దిపేట): నర్మేటలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శనివారం మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్ పామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి తెలిపారు. గురువారం నర్మేటలో మాట్లాడుతూ రూ.300 కోట్లతో నిర్మించనున్న ఫ్యాక్టరీతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ఉమ పాల్గొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప గ్రామంలో నూతనంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి మాల మహానాడు మండలాధ్యక్షుడు శివలింగం రూ.10 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఐలయ్య, మల్లేశం, యాదగిరి, శ్రీనివాస్, బాలేశం తదితరులు పాల్గొన్నారు.

◆ హరిత విప్లవ సృష్టికర్త మృతి తీరనిలోటు

గజ్వేల్‌రూరల్: దేశంలో హరిత విప్లవానికి నాందిపలికి వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యవసాయ శాస్త్రవేత ఎంఎస్ స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరనిలోటని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మెజార్టీ ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగానికి బలమైన పునాదులు వేసిన వ్యక్తి స్వామినాథన్ అన్నారు. పంటల సాగులో కొత్త వంగడాలను సృష్టిస్తూ ఆహార ధాన్యాల కొరత లేకుండా చేశారని కొనియాడారు.

◆ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరుకు చెందిన మైనర్ బాలుడు (17) గురువారం బైక్ నడుపుతూ కన్పించడంతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, తండ్రికి రూ.1500 జరిమానా విధించామని బేగంపేట ఎస్ఐ అరుణ్ తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే ఆస్కారముందన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదుచేస్తామని హెచ్చరించారు.

◆ దాసోజు అభ్యర్థిత్వాన్ని పునః పరిశీలించాలి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ కోటలో సిఫార్సుచేసిన దాసోజు శ్రవణ్ అభ్యర్థిత్వాన్ని పునఃపరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శి వజ్రోజు శంకరాచారి విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల బలమైన గొంతుక దాసోజు శ్రవణ్ అని అన్నారు. ఆయనను ఎమ్మెల్సీగా ప్రకటించాలన్నారు.

కబ్జా నుంచి కాపాడాలి

తొగుట(దుబ్బాక): ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిని కబ్జా నుంచి కాపాడాలని బండారుపల్లి గొల్లకురుమలు తొగుట ఎస్ఐ లింగంకు గురువారం వినతి పత్రం అందజేశారు. గ్రామ శివారులో 20, 37 సర్వే నంబర్లలో 5.04 ఎకరాలు ప్రభుత్వం తమకు కేటాయించిందన్నారు. 2005లో నాటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా పట్టాలను తీసుకున్నామన్నా రు. ఈ మేరకు ఎస్ఐ విచారణ చేపట్టారు. గొల్ల కురుమలకు కేటాయించిన భూమి వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. భూమి కోసం గ్రామస్తులు ఘర్షణకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యను ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

పేద మైనార్టీ కుటుంబాలకు ప్రభుత్వం అండ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలను సీఎం కేసీఆర్ ప్రభుత్వం సమానదృష్టితో చూస్తోందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పేద ముస్లిం కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలలో చాలా కుటుంబాలు పేదరికంతో ఇబ్బందులు పడుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం ఆ కుటుంబాలను ఆదుకునేందుకు చాలా పథకాలను అమలు చేస్తోందన్నారు. ముస్లింలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి

మిరుదొడ్డి(దుబ్బాక): ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో ట్రస్మా ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉన్నప్పుడే సమాజంలో మంచి మార్పు కనిపిస్తుందన్నారు. ప్రైవేట్ టీచర్లకు రూ.5 లక్షల వరకు తన సొంతుగా హెల్త్ కార్డులు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకోవడానికి హెల్త్ కార్డులు ప్రైవేట్ టీచర్లకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్ రంగనబోయిన రాములు, ఎంపీటీసీలు సుతారి నర్సింహులు, ధర్మారం లక్ష్మీ మల్లయ్య, ట్రస్మా ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి సత్తు మహిపాల్ రెడ్డి, కుంట రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరలో ఎరువులు, విత్తనాలు

చేర్యాల(సిద్దిపేట): రైతుసేవ, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తక్కువ ధరలో కొనుగోలు చేయొచ్చని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. గురువారం మండలంలోని నాగపూరి రైతువేదికలో నాగపూరి, శభాష్‌గూడెం, పోతిరెడ్డిపల్లి రైతులతో నాగపురి రైతుసేవ, రైతు ఉత్పత్తిదారుల ద్వితీయ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ కరుణాకర్, ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ మధుకర్‌తో కలసి మాట్లాడారు. ప్రస్తుతం ఈ సంఘంలో 504 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, భవిష్యత్‌లో మరింత కొంతమందిని సభ్యులుగా చేర్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో నాగపూరి సర్పంచ్ సంతోషి, ఉపసర్పంచ్ ఎల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ మధుకర్

యువతకు భగత్ సింగ్ ఆదర్శం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యువత భగత్ సింగ్‌ను స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థి, యువజన, వివిధ సంఘాల నాయకులు అన్నారు. గురువారం భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి ఎస్‌ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్, తదితర విద్యార్థి సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

గజ్వేల్‌రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని, యువత ఆయన ఆశయ సాధనకు కృషి వేయాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు పిలుపు ఇచ్చారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని కేజీబీవీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రవి, గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపు నిచ్చారు. గురువారం భగత్‌సింగ్ 116వ జయంతిని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని అంగడి బజార్‌వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం నాజన్మ హక్కు అని చెప్పి బ్రిటీష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఈరి భూమయ్య, సుదర్శన్, రాజు, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు



సిద్దిపేటలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పాటల సీడీ అవిష్కరణ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన కోతి దీక్షిత్, అశ్విక రూపొందించిన హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి పాటల సీడీని గురువారం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదల ఆర్థిక అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను అమలు చేయడంతో చాలా మంది సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారన్నారు. కేసీఆర్ కలల పథకం దళిత బంధుతో పేదలకు స్వయం ఉపాధి కల్పించడానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లకావత్ మానస, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీశ్ కుమార్

'మా ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తే సహించం'

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై దుష్ప్రచారం చేస్తే సహించబోమని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బిగుల్ల మోహన్ హెచ్చరించారు. బెజ్జంకిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వివిధ పార్టీల నాయకులు మీడియా, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.